ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యేలు రేవూరి, కేఆర్, కడియం
- దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు
- సన్మానించిన పలువురు


నయీంనగర్: ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని కలిసిన సభ్యులు


దామెర : దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యేలు

దామెర: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని సైలానిబాబా దర్గాలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు చాదర్లు, పూలమాలలు సమర్పించారు. అనంతరం దర్గా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ హమీద్ ఆశీర్వచనం అందించడంతో పాటు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సైలాని బాబా ఆశీస్సులతో ఎమ్మెల్యేలుగా గెలుపొందామని, దర్గా అభివృద్ధితో పాటు నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. వీరి వెంట తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, మాజీ సమితి ప్రెసిడెంట్ రాజయ్య, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, దుబాసి రాధాకృష్ణ, శనిగరం సుధాకర్, మోయిన్, పోతుల కొమ్మాలు, వివిధ గ్రామాల అధ్యక్షుడు పాల్గొన్నారు.

సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలి

పరకాల: పట్టణంలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పరకాల బార్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందించారు. న్యాయవాదుల విన్నపంపై సానుకూలంగా స్పందించిన ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి మరోసారి తీసుకెళ్లి సబ్‌కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.చంద్రమౌళి, ప్రధానకార్యదర్శి శ్రావణ్‌కుమార్, న్యాయవాదులు మేరుగు శ్రీనివాస్, ఒంటేరు రాజమౌళి, శంకర్, రవికుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రేవూరికి అభినందనల వెల్లువ

దామెర : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి బుధవారం అభినందనలు వెల్లువెత్తాయి. మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. వాణి, శ్యామల, పోతుల రజిత, కోమల, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజును కలిసిన ఎంపీటీసీలు

ఐనవోలు: మండలంలోని గర్మిళ్లపల్లి, నందనం గ్రామాలకు చెందిన బీరం మౌనిక దేవేందర్‌రెడ్డి, జెట్టబోయిన లక్ష్మి బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలను గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. గ్రేటర్ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కోశాధికారి బోళ్ల అమర్, వైస్ ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రెటరీలు, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన వరంగల్ కలెక్టర్


కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్

ధర్మసాగర్: మండలంలోని ముప్పారం శ్రీముఖ్యనాథస్వామి దేవాలయాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు చైర్మన్ శివసాని ప్రవీణ్‌రవీంద్ర కలెక్టర్‌కు ఆలయ చరిత్రను వివరించారు. రెండు సంవత్సరాలుగా ఆలయంలో జరుగుతున్న భక్తుల పూజలు, ఇటీవల పూర్తి అయిన ముఖ్యనాథస్వామి వారి పునఃప్రతిష్ఠాపన మహోత్సవం గురించి వివరించారు. అదే విధంగా ఆలయం పక్కన పెద్దచెరువు, స్వామి వారి క్షేత్రం చుట్టూ విశాలంగా అడవి, ఇనుపరాతి గట్లు ఉన్న ఈప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే గొప్ప పర్యాటక ప్రదేశం అవుతుందని, అందుకు సహకరించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో ఎవరెస్టు అధిరోహించిన అన్విత, పూర్ణ, అఖిల్ ముప్పారం ఇనుపరాతి గట్లకు ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యాదగిరి, నర్సింహస్వామి, యాదగిరి, భిక్షపతి, శ్రీనివాస్, మల్లయ్య, ఫారెస్టు బీట్ అధికారులు బలరామ్, రతన్‌లాల్, వాచర్ కమాలాకర్, అశోక్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

దామెర: మండలంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లోని మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వారీగా ఈజీఎస్ లేబర్ రిపోర్ట్‌తో పాటు పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడారు. హరితహారం మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో నూతన మొక్కలు నాటాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయంలో మహిళల కుంకుమార్చన


పట్టణంలోని కుంకుమేశ్వరస్వామి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

పరకాల: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం కుంకుమార్చన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా దాతల సాయంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీపోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకటయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణంశర్మ, ధర్మకర్తలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులకు రగ్గుల పంపిణీ


రగ్గులు పంపిణీ చేస్తున్న వెంకటనారాయణ

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చలికాలం దృష్ట్యా 39మంది పంచాయతీ కార్మికులకు రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ ఉచితంగా రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పంచాయతీ కార్మికుల సేవలు కీలకమని అన్నారు. వారికి తమ వంతుగా ఈ సాయం అందిస్తున్నట్లు తెలిపారు. తర్వలోనే భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. జెడ్పీటీసీ వంగ రవీందర్, సర్పంచ్ మాడుగుల కొమురయ్య, ఎంపీటీసీలు అప్పని పద్మ, బొల్లంపల్లి రమేష్ పాల్గొన్నారు.

పెద్దాపూర్‌కు సరిహద్దులు నిర్ణయించాలి



ఆత్మకూరు: మండలంలోని పెద్దాపూర్‌కు సరిహద్దులు నిర్ణయించిన తర్వాతనే అక్కంపేట గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని పెద్దపూర్‌కు చెందిన అఖిలపక్షం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధికరాజు, సర్పంచ్ కమల రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీ రమేష్ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

హసన్‌పర్తి: గ్రామీణ ప్రాంతాల్లో రెడ్ క్రాస్ చేపడుతున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ పెద్ది తిరుపతమ్మ కొనియాడారు. రెడ్ క్రాస్ హనుమకొండ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం గంటూరుపల్లిలో బుధవారం సంచార వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా గ్రామానికి వైద్యులు వచ్చి వృద్ధులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ఉచిత సంచార వైద్య శిబిరాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, కోశాధికారి పాపిరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన శిబిరంలో డాక్టర్ కిషన్‌రావు, డాక్టర్ మదన్ మోహన్ రావు, రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది శివకుమార్, సాగర్, సతీష్, రమేష్, పోశాలు, స్థానికులు పెద్ద మల్లారెడ్డి, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో సహస్ర ప్రతిభ

హసన్‌పర్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాలోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరిగిన ప్రపంచ తెలుగు బాలల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో నగరంలోని ఎస్వీఆర్ పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి ఎం.సహస్ర ప్రతిభ కనబరిచింది. కూచిపూడి నృత్యంలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు శివకుమారి తెలిపారు. బొంపల్లి సుధీర్‌రావు వద్ద పదేళ్లుగా సహస్ర శిక్షణ పొందుతోంది.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు

కాశిబుగ్గ: మంగళవారం రాత్రి అమావాస్యను పురస్కరించుకుని వరంగల్ దయానందకాలనీ సమీపంలోని కనకదుర్గామాత దేవాలయంలోని స్వర్ణాకర్షణ కాలభైరవుడికి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాశ్ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం చేయించి పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, సురేష్‌కుమార్, ప్రభాకర్, శారద, అర్చకులు శ్రవణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

రేపు 'ఎమ్మార్పీఎస్' సమావేశం

హన్మకొండ: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల సమావేశాన్ని ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మందకుమార్ మాదిగ తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ హనుమకొండ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ అమలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్, నాయకులు జన్ను దినేష్ మాదిగ, మంద రాజు మాదిగ, బండారి సురేందర్ మాదిగ, బొడ్డు శాంతిసాగర్ మాదిగ, రాజారపు భిక్షపతి, బొక్కల నారాయణ మాదిగ, ఆకారపు మురళి మాదిగ, తోట శ్రీనివాస్ మాదిగ, మల్లేష్ మాదిగ, మంద స్వరాజ్ మాదిగ పాల్గొన్నారు.

విద్యార్థులకు 'నాసా' కిట్ల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని రెనాల్ట్స్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం నాసా కిట్లు పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ పోశాల పద్మ హాజరయ్యారు.

విచారణ చేపట్టిన అధికారులు



ఆత్మకూరు: మండల కేంద్రంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయురాలు, సహాయకురాలు మధ్య జరిగిన ఘర్షణపై ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సీడీపీఓ భాగ్యలక్ష్మి బుధవారం విచారణ చేపట్టారు. ఉపాధ్యాయురాలు పద్మ విధినిర్వహణ సరిగా లేకపోవడంతో మెమో జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. బాధ్యతగల వృత్తిలో ఉండి ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు.

ప్రజలకు ఆసక్తిఉన్న మొక్కలనే పెంచాలి

- జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కమలాపూర్: గ్రామాల అవసరాలతో పాటు ప్రజలు ఆసక్తికరంగా ఉన్న మొక్కలను మాత్రమే నర్సరీల్లో పెంచాలని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఉప్పల్ గ్రామపంచాయతీ నర్సరీలు, మొక్కల పెంపకం, నిర్వహణపై గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, వనసేవకులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి నర్సరీలో 85 శాతం మొక్కలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏడాది పాటు మొక్కలు అందుబాటులో ఉండాలని, ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని ఆదేశించారు. ఎంపీడీఓ గుండె బాబు మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా పంచాయతీ కార్యదర్శులకు మొక్కల పెంపకం, నర్సరీల నిర్వహణపై పూర్తిస్థాయి అవగాహన కల్పించామని, కానీ కొన్ని గ్రామాల్లో నర్సరీల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శిక్షణలో చెప్పిన అంశాలను పంచాయతీ కార్యదర్శులు అవగాహన చేసుకుని నర్సరీలను నూరు శాతం సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి విత్తనాల సేకరణ, విత్తనాలు నాటే విధానం, బ్యాగుల్లో మట్టి నింపే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విమల, ఏపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లు, వనసేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలి


చిన్నారులతో ఉపాధ్యాయులు

కమలాపూర్: విద్యార్థులు పాఠశాల దశలోనే లక్ష్యాన్ని ఎంచుకుని సాధించాలని బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.రాజమల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని టాకీస్ ఏరియా ఎంపీపీఎస్‌లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా రాజమల్లయ్య మాట్లాడుతూ.. స్వయం పరిపాలన దినోత్సవాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో పరిపాలన నైపుణ్యాలు పెంపొంది భావి భారత పౌరులుగా ఎదిగి దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతారన్నారు. అనంతరం మండల నోడల్ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల దశలోనే లక్ష్యాలు ఎంచుకుని సాధించాలని, అందుకు తగినట్లుగా ఉపాధ్యాయులు వారిని తీర్చిదిద్దాలని అన్నారు. పాఠశాల హెచ్ఎం పీడబ్ల్యూసీ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల విషయ పరిజ్ఞానం, వారి సామర్థ్యాలు పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలు అందిపుచ్చుకోవడానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగవంశీ, ఎస్టీటీ టి.శ్రీనివాస్, రిసోర్స్‌పర్సన్ ఎస్.ప్రకాష్‌బాబు, ఉపాధ్యాయులు జె.కాంతయ్య, సీహెచ్.మమత, సీఆర్పీలు సుభాష్, శ్రీనివాస్, ఐఈఆర్పీ రవి, ఎమ్మార్సీ సిబ్బంది స్వర్ణ, స్రవంతి, ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇరువురికి గాయాలు


నడికూడ : గాయపడ్డ తిరుపతి

నడికూడ: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ధర్మారం గ్రామశివారు పరకాల – అంబాల ప్రధాన రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన ఆలిగేటి అమర్ వ్యక్తిగత పనుల నిమిత్తం హనుమకొండకు వెళ్లివస్తున్న క్రమంలో మండలంలోని రామకృష్ణపూర్ గ్రామానికి చెందిన రేషన్‌షాపు డీలర్ నుటింకి తిరుపతి, స్వరూప దంపతులు పరకాల నుంచి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ధర్మారం గ్రామ శివారులోని ఇప్పలపల్లి బస్‌స్టాప్ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. అమర్, తిరుపతికి తీవ్ర గాయాలు కాగా స్వరూపకు స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు.

ఆటో ఢీ కొట్టిన సంఘటనలో..

ఐనవోలు: ఆటో ఢీ కొట్టిన సంఘటనలో వ్యక్తికి గాయాలు అయ్యాయి. ఎస్సై వంగాల నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కక్కిరాలపల్లికి చెందిన కంజర్ల కుమారస్వామి తన ద్విచక్ర వాహనంపై వరంగల్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కక్కిరాలపల్లి శివారు మలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని ఆటో ఢీ కొట్టింది. దీంతో కుమారస్వామి కాలికి గాయమైంది. బాధితుడి కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు కల్యాణక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మేకల స్వప్న

ఎల్కతుర్తి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన 125 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద ఎంపీపీ మేకల స్వప్న, తహసీల్దార్ జగత్‌సింగ్, సర్పంచ్ కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, స్పంచల ఫోరం మండల అధ్యక్షుడు కడారి రాజు కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అలాగే భీమదేవరపల్లి మండలంలో 136మంది లబ్ధిదారులు కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ వెంకటభాస్కర్, ఎంపీపీ జక్కుల అనితరమేష్, జెడ్పీటీసీ వంగ రవీందర్, సర్పంచ్ మాడుగుల కొమురయ్య, ఎంపీటీసీలు బొల్లంపల్లి రమేష్, అప్పని పద్మ పాల్గొన్నారు.

'మనోబంధు'కు సమాచారం ఇవ్వాలి

శాయంపేట : మతిస్థిమితం కోల్పోయి రోడ్డుపై తిరిగే వారిని గుర్తించి మనోబంధు స్వచ్ఛంద సంస్థకు సమాచారం అందిస్తే వారికి మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఏ ప్రాంతంలోనైనా మతిస్థిమితం కోల్పోయి రోడ్డు వెంట తిరిగేవారు కనిపిస్తే స్మార్ట్ ఫోన్‌లో ఫోటో తీసి లొకేషన్‌తో 9390102404కు వాట్సప్ ద్వారా మనోబంధు స్వచ్ఛంద సంస్థకు సమాచారం అందించాలని కోరారు. వారిని చేరదీసి వైద్య చికిత్స అందించినట్లు తెలిపారు. చికిత్స అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు. గతంలో కూడా ఎంతో మంది నిరాశ్రయులకు వైద్య సేవలు అందించినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి ఎంపిక



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.లహరి జాతీయస్థాయి ఫుట్‌బాల్ క్రీడలకు ఎంపికైనట్లు పీఈటీ కరిత తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి 10వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్ 17 విభాగంలో లహరి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి 29 వరకు బీహార్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయస్థాయి ఫుట్‌బాల్ క్రీడల్లో లహరి పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీలత, పీఈటీ కరిత, ఎస్ఎంసీ చైర్మన్ రవీంద్రచారి, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల చేయూత



కమలాపూర్: మండలంలోని గూడూరుకు చెందిన పిల్లల మురళి (శివ ఆర్ట్స్) భార్య భారతి (జ్యోతి) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా 1990–91లో పదోతరగతి బ్యాచ్‌కు చెందిన మురళి స్నేహితులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జ్యోతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మురళి ఆర్థిక ఇబ్బందులను గమనించిన స్నేహితులూ.. వారి కూతురు జాహ్నవి పేరిట రూ.60 వేలు పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండును అందజేశారు. ఈ కార్యక్రమంలో నద్దునూరి భద్రయ్య, బాలసాని దేవేందర్ గౌడ్, పత్తిపాక సురేష్, పల్లం అశోక్, అంకతి శ్రీలత, కొండం రత్నమాల, మోకిలె రాజమణి, అరుణాబాయి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై



దామెర: నూతన ఎస్సైగా కొంక అశోక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏఆర్ విభాగం నుంచి బదిలీపై దామెర మండలానికి వచ్చారు. ఇంత కాలం దామెర ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించిన ముత్యం రాజేందర్ కమిషనరేట్‌కు(వీఆర్) బదిలీ అయ్యారు. కాగా నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఏఎస్సైలు సిద్ధయ్య, రాజు, హెడ్ కానిస్టేబుల్ యాకయ్య, సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ-కేవైసీకి తుది గడువు లేదు

శాయంపేట : గ్యాస్ వినియోగదారులు ఆధార్ కార్డుతో లింక్ చేసుకునే ఈ కేవైసీకి తుది గడువు లేదని ఆదిరెడ్డి భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు దుంపల తిరుపతి రెడ్డి బుధవారం తెలిపారు. లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్ పుస్తకంతో పాటు ఆధార్‌కార్డును వెంట తీసుకురావాలని కోరారు. ఈ కేవైసీకి ప్రభుత్వం అందజేసే సబ్సిడీకి ఎలాంటి సంబంధంలేదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పరామర్శ

కాశిబుగ్గ: బీజేపీ 26వ డివిజన్ నాయకుడు కూచన సంతోష్(45) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు బుధవారం నివాళులర్పించి, బాధిత కుటుంబీకులను పరామర్శించారు. సంతోష్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

రైతులకు పంటసాగుపై అవగాహన



కరీమాబాద్: గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో మామునూరులో పంటల సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకేలో శిక్షణ పొందుతున్న మల్లారెడ్డి విశ్వవిద్యాలయ వ్యవసాయ విద్యార్థులు గ్రామీణ విశ్లేషణాత్మక తులనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నక్ష, వనరుల పటం, సమస్యల చెట్టు, కాలక్రమం పటం వంటి పటాలను నేలపై చిత్రించి ప్రదర్శించారు. ఈక్రమంలోనే గ్రామంలో వనరుల కొరత, నీటి సమస్య, మురుగు నీరు, కూలీల కొరత సమస్యల గురించి రైతులు వివరించారు. సమస్యలను ఎలా అధిగమించాలో రాజన్న సూచించారు. తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, అరుణజ్యోతి, రాజు, శశాంక్, సాయికిరణ్, గణేష్, రైతు కమిటీ అధ్యక్షుడు రఘుకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.